# మా ఆలిడు బంగారం

అలివేలు నిద్రలో అదిపడినట్లుగా లేచి కూర్చుంది ! కళ్ళు నులుముకుని చూసింది... పక్కనే పక్క మీద గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు పతిదేవుడు చిదానందం. టైమెంతయిందో తెలియదు. తెరచి వుంచిన పిల్లల గదిలోంచి అలారం టిక్‌టిక్‌మంటూ వినిపిస్తోంది.

అలివేలుకు ఏదో ఆనందంగా వుంది.... ఎగిరి గెంతాలన్నంత ఉత్సాహంగా ఉంది... అలా అని ఎగిరి గెంతలేదుకాని, గురకతోబాటు, ఎగిరిపడుతోన్న పతిదేవుని పొట్టమీద 'పట్' మని కొట్టింది....!

"అమ్మోయ్! చచ్చాన్రో దేవుడోయ్!" కెవ్వుమని చిదానందం లేచికూర్చుని పెడబొబ్బలు పెట్టాడు.

"చాల్లెండి సంబడం! చిన్నపిల్లాడిలా అరుపులూ మీరూనూ... నేను మీకొక అద్భుతమైనవార్త చెబుదామని చిన్నగా పొట్టపై తట్టిలేపితేనూ....!"

"చిన్నగా తట్టిలేపావా... ? నిద్రలో, ఒకే దెబ్బతో పై లోకాలకి పంపిద్దామనుకున్నావా..? అమ్మా! అంటూ" చిదానందం బాధగా పొట్టపట్టుకున్నాడు.

"ఏవండీ! తెల్లవారు ఝామునొచ్చిన కలలు నిజమవుతాయంటారుకదా... ?" అతని మాటలు పట్టించుకోని అలివేలు ఆనందంలో మునిగితేలుతూ అంది.

" ఓసి నీ అసాధ్యంకూలా...? బంగారంలాంటి నిద్ర పాడుచేసింది కాక- ఇప్పుడు తెల్లవారుఝాము అంటావేమిటే... ?ఏ ఒంటిగంటో.. రెండో..."

"టైమెంతయితేనేంలెండి! సాక్షాత్తూ ఆ శ్రీ మహాలక్ష్మి నా కల్లోకొచ్చిందండీ... ! వచ్చీ.. వెయ్యిగ్రాముల బంగారం నీ పరమవుతుందని, దీవించిందండీ....!"

అలివేలు కళ్ళుమూసుకుని, రెండు చేతులూ కలిపి, తన్మయత్వంతో దణ్ణం పెట్టుకుంది... !

"ఏమిటీ శ్రీ మహాలక్ష్మి కల్లోకి వచ్చిందా? బంగారం వరమిచ్చిందా...? అర్ధరాత్రి అంకమ్మ శివాలన్నట్లు నిన్నేదో ఆవహించింది... నీతో పిచ్చిప్రేలాపన చేయిస్తోంది... !" చిదానందం తలపట్టుకున్నాడు.

"మీకేమీ తెలియదండి...! అర్థరాత్రి అదృష్టం తలుపు తట్టడమంటే అదేమరి..!

"అదృష్టమా .. నా బొందా .. ? అదేదో చెప్పితగలడు" చిదానందం దుప్పటి కప్పుకోబోయాడు.

"అదే నండీ.. వై టీవీ'లో'ఒళ్ళంతా బంగారం!' ప్రోగ్రాంకి, ఎనభై ఎస్.ఎమ్.ఎస్.లు

పంపించానా... ? వివరాలతో ఇరవై ఉత్తరాలు రాశానా.. ! ఏ జవాబూ రాలేదు... శ్రీ మహాలక్ష్మి కల్లో దీవించిందికదా! ఇప్పుడు లైను కలుస్తుంది రమ్మన్న ఆహ్వానం, రంయ్‌మని వస్తుంది. చూడండి...!" అంటూ అలివేలు, బంగారం కల ప్రభావంతో ఒక్క అంగలో మంచం దగి'జింతాక తక తక' అన్నట్లు గెంతులు వేయసాగింది... !

'ఒళ్ళంతా బంగారం!' ఒక ప్రోగ్రాంకోసమే, ఎనభై మెసేజ్‌లు పంపించిందా...? ఇరవై ఉత్తరాలు రాసిందా....? ఇంకా ఎన్ని పోటీలకి, సెల్‌ఫోను నొక్కుకుంటూ డబ్బు నీళ్ళలా ఖర్చుపెడుతుందో? తను ఆఫీసుకుపోగానే... 'తోచీతోచనమ్మ తోడికోడలు పుట్టింటికి వెళ్ళినట్టు కావాలనే, కొంపకొల్లేరు చేస్తోంది.. పైగా ఈ మధ్య బంగారం వెర్రి ముదిరిపోయింది.

అక్కడెక్కడో, కరీంనగర్‌లో కనకదుర్గకి నలభై కాసుల బంగారం వచ్చిందనీ, మంగళగిరిలో వెంగమాంబ తొంభై గ్రాముల బంగారం గెలుచుకుందనీ.. ప్రతిరోజూ కబుర్లు చెబుతుంది.

రాత్రి తొమ్మిదిగంటలకల్లా ఠంచనుగా పనులన్నీ ముగించుకుని 'ఒళ్ళంతా బంగారం' కార్యక్రమాన్ని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తుంది. ఇప్పుడేమో సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మి కల్లోకొచ్చిందని అర్ధరాత్రి గెంతులేస్తోంది... ! ఏమిటి చేయడం.... ? అలివేలు పిచ్చినెలా అదుపుచేయడం.. ?

చిందానందానికి, పీకలదాకా కోపం ముంచుకొచ్చింది...! కాస్సేపు జుట్టు పీక్కున్నాడు... ఆ పిదప చేసేది లేక నెత్తీనోరూ బాదుకున్నాడు....!

" మీరెంత బాదుకున్నా.... నా లక్ష్యసాధనలో వెనకడుగువేసేదిలేదు... వెయ్యిగ్రాముల బంగారం సాధిస్తాను. నేనేమిటో నిరూపిస్తాను" అంది అలివేలు. ఒంటిపూట ఉపవాసంతో బంగారం కోసం వ్రతం మొదలుపెట్టి.. శ్రీ మహాలక్ష్మికి నైవేద్యం పెట్టసాగింది... ఒంటిపూట ఉపవాసంలోనే శరపరంపరగా ఎస్.ఎమ్.ఎస్.లు పంపించింది... ఉత్తరాలు రాసింది.

మరో వంద 'మెసేజ్'లు పాతిక ఉత్తరాలు అందుకున్న 'వై టీవి' ఊపిరాడక, అలివేలు ధాటికి తట్టుకోలేక, తక్షణం హైదరాబాద్ రమ్మని ఆహ్వానం పంపింది... ఫోనుచేసి వివరాలు చెప్పింది.

ఆహ్వానం అందుకున్న అలివేలు, సంతోషంతో.. మళ్ళీ 'జింతాక తక తక' గెంతులు వేసింది.

'యాహూ' అంటూ కేరింతలు కొట్టింది... ఆఫీసు నుంచి వచ్చిన చిదానందం పొట్టమీద ఓ పోటు పొడిచింది... అతను గుడ్లప్పగించి గోడకు బల్లిలా అంటుకుపోగా అప్పుడు శుభవార్త చెవిలో వేసింది.

ఏమండీ! అక్కడ మనందరికీ వుండటానికి పెద్ద గదులు భోజనసదుపాయాలు భారీగా

ఏర్పాటు చేస్తారట. మీరెళ్ళి 'గౌతమీ' కి రెండు అరటిక్కట్లు, రెండు ఫుల్ టిక్కెట్లు రిజర్వేషన్ చేయించండి!" చిదానందాన్ని ప్రేమగా ఇంట్లోంచి బయటకు గెంటింది.

చుట్టుప్రక్కల ఇళ్ళల్లో వున్నవాళ్ళకి'ఒళ్ళంతా బంగారం!' ప్రోగ్రాంకి వెళ్తున్నామని గొప్పగా చాటింపు వేసింది. దూరంగా వున్న బంధువులకి, స్నేహితులకి ఫోన్లు చేసి 'వై' టీవిలో కార్యక్రమం కోసం ఎదురు చూడండంటూ, వాళ్ళతో శుభాకాంక్షలు చెప్పించుకుంది..!"

"శ్రీ మహాలక్ష్మీ! ఒళ్ళంతా బంగారం అనుగ్రహించు తల్లీ" అనుకుంటూ ఒకరోజు ముందు భర్త చిదానందం, చిరంజీవులు రాకేష్, రమ్యలతో కలిసి " గౌతమీ ఎక్స్‌ప్రెస్" ఎక్కేసింది.

అలివేలు కుటుంబమంతా 'గౌతమీ' లో దిగగానే హైదరాబాదు ఎంతో అహ్లాదంగా కనిపించింది... చుట్టుముట్టిన ఆటో వాళ్ళల్లో ఒకడు ముందుకు వచ్చి చిదానందం చేతిలో సూట్‌కేసూ, అలివేలు చేతిలో హ్యాండు బ్యాగు పట్టుకుని పారిపోయాడు.

వాడితోపాటు పరుగెత్తి జనంలోంచి తప్పించుకుని.. ఆ శాల్తీని పట్టుకునేసరికి వాడు, లగేజీ ఆటోలో పడేసి స్థిమితంగా కూర్చున్నాడు. అలివేలు కూడా ఒక చేత్తో చిదానందం చొక్కాపట్టుకుని, మరోచేత్తో పిల్లల్ని లాక్కుంటూ అక్కడినుంచి బయటపడింది.

" వై టీవి' స్టూడియోకెళ్ళాలి... ఎంతవుతుంది?" చిదానందం ఆయాసంతో అడిగాడు.

"నాలుగొందలస్సార్! జల్దీ ఎక్కండి... !"

"ఇద్దరు పిల్లలూ! ఇద్దరు పెద్దాళ్ళకి నాలుగొందలా?" ఛాతీ ఎడమవైపు చేయివేసుకున్నాడు చిదానందం"

"ఏమిసార్ గట్ల మాట్టాడుతున్నారు.. 'వై టీవి' ఏడ్నుందో ఎరికనా..? ఊరికి నలభైమైళ్ళ దూరంలో వుంది ఆ స్టూడియో... ఎక్కండి సాబ్...!"

"ఏమిటి ఆలోచిస్తున్నారు? శుభమాని, శ్రీమహాలక్ష్మి ప్రోగ్రాంకి వెళ్తూంటే శంకలు ఎందుకంటా?" అలివేలు పిల్లలతో ఆటో ఎక్కికూర్చుంది.?

చిదానందం బుసకొడుతూ ఆటో ఎక్కక తప్పలేదు...! ఆటోవాడు, అనేక గల్లీలు, సందులు, రోడ్లు తిప్పి, ఇరవై నిమిషాల్లోపే 'వై టీవి' స్టూడియో ముందు ఆపాడు.. నవ్వుతూ గుట్కానములుతూ, నాలుగు వందలూ వసూలు చేశాడు.... చిదానందం, గొడవ పెట్టుకోబోయాడుగానీ, అలివేలు అడ్డుపడింది.

'వైటీవి' స్టూడియో గేటు, రాజుగారి కోట ముఖద్వారంలా వుంది. అందరూ నోరెళ్ళబెట్టి చూశారు.

బంగారం ప్రోగ్రాం కోసం పాస్ చూపించి, భర్త పిల్లలతో.. ఆ ద్వారంలోంచి నడుస్తూంటే.. అలివేలుకు గర్వంగా అనిపించింది. లోపలికి వెళ్ళేసరికి, ఎదురుగా ఆఫీసు అన్న పెద్ద బోర్డు కనిపించింది. అలివేలు తన వివరాలు వెల్లడించింది.

ఆఫీసులో బుర్రమీసాలున్న ఒక వ్యక్తి వరండాలో వరుసగా వున్న గదుల్లో ఒక గది చూపించి, అందులో వుండమన్నాడు... అప్పటికే, ఆ గదిలో మరో రెండు కుటుంబాల వాళ్లు వున్నారు.....వాళ్ళూ, ' ఒళ్ళంతా బంగారం' ప్రోగ్రాం కోసమే వచ్చారట.

చిదానందం బుసకొడుతూ, కసిగా పళ్ళు కొరికాడు... అలివేలు వాళ్ళందరినీ 'హాయ్' అంటూ పలకరించింది. వాళ్ళందరూ ఏఏ ఊళ్ళనుంచి వచ్చారో అడిగి తెలుసుకుంది....!

"అలివేలుగారు ఎవరండీ... ?" సూటూబూటూలో వున్న ఓ వ్యక్తి గుమ్మంముందు నిటారుగా నిలబడ్డాడు... అలివేలు, ముఖం చేటంత చేసుకుని ముందుకొచ్చింది.

"సాయంత్రం ఏడుగంటలకి, మీ ప్రోగ్రాం రికార్డు చేయడం జరుగుతుంది. మీరు సిద్ధంగా వుండండి... ప్రోగ్రాం గురించి తెల్సుకదా... ?

"ఏమైనా టీ, టిఫిన్లు కావాలంటే... ఈ వరండా కుడివైపు క్యాంటీను వుంది. వెళ్ళి తిని రండి ! మధ్యాహ్నం భోజనాలు మీరు ఉచితంగా చేయవచ్చు. ఆల్ ది బెస్ట్... !" అని చెప్పి సూటు వ్యక్తి బూట్లు టకటకలాడిస్తూ వెళ్ళిపోయాడు."

చిదానందం పిల్లల్ని తీసుకుని క్యాంటీనువైపు నడిస్తే... అలివేలు వరండాలో పచార్లు చేసింది. అన్నిగదుల్లోనూ ఆడవాళ్ళున్నారు. వాళ్ళ చేతుల్లో ఏవో పత్రికలు, పుస్తకాలు! అలివేలుకు, ఏదో గుర్తుకువచ్చినట్లు అక్కడి కుర్చీలో కూర్చుని హ్యాండు బ్యాగులోంచి రెండు సినిమా పత్రికలు, పెద్దబాలశిక్ష బయటకు తీసింది.

'ఒళ్ళంతా బంగారం' ప్రోగ్రాంలో.. ఏం ప్రశ్నలు అడుగుతారో ఎవరికీ అంతుపట్టదు...! ధృతరాష్ట్రుడి మనుమడి పేరేంటి అన్నది ఒక ప్రశ్న... చాణక్యుడు పిలక పొడవెంతో చెప్పగలరా అన్నది మరోప్రశ్న ... ' పోకిరి పిల్ల' పాతికరోజులు ఎన్ని సెంటర్లలో ఆడింది? ఇలా అన్నిటికీ టకటకా జవాబులు చెప్పెయ్యాలి... ?

"అమ్మో!" వాళ్ళు అడిగే ప్రశ్నలు తలచుకున్న అలివేలు బుద్ధిగా పెద్దబాలశిక్ష చదువుకోసాగింది.

సాయంత్రం ఏడుగంటలయింది.....! పిలుపురాగానే అలివేలు, చిదానందం, పిల్లలతో స్టూడియో గదిలోకి అడుగుపెట్టింది. విశాలమైన గది... 'గోదావరిగట్టు - కొబ్బరిచెట్టు' నేపథ్యంగా గీసిన అందమయిన చిత్రంతో గదికి ఒకవైపుగా ఎత్తయిన వేదిక అలంకరించబడి వుంది... వేదిక వెనుక, ' ఒళ్ళంతా బంగారం' అక్షరాలు పొదిగినట్లుగా బంగారం రంగులో మెరుస్తూ... వెలుగుతూ ఆరిపోతున్నాయి.

ఒక మూల కెమెరాలు, ఫ్లడ్‌లైట్లు వెలుగులు - కెమెరా మెన్ల హడావుడి. మరోవైపు నుంచి కిందకు నిలబెట్టిన గ్యాలరీ బెంచీమీద, పన్నెండు జంటల దంపతులు వాళ్ళపిల్లలూ కూర్చొని.. చకోరపక్షుల్లా తమ అవకాశం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

వేదికమీద ... సినీతార పంకజవాణి, యాంకరమ్మ స్థానంలో వుంది. యాంకరమ్మ ఒంటినిండా వంకరలే అన్నట్టుగావుంది...! పొడవైన మెడ, అటూ ఇటూ ఆడిస్తూ పర్షియన్ జాతి కొంగలా ఉంది. ఎందుకో ఆమె పెదాలు, మూసిన పళ్ళన్నీటినీ బయట పెడుతున్నాయి. కార్యక్రమం మొదలయింది.

యాంకరమ్మ అందరికీ ప్రోగ్రాం వివరాలు, పోటీ నిబంధనలూ చెబుతూ... పది ఆటలు పూర్తిగా ఆడిన వారికి వెయ్యిగ్రాముల బంగారం వస్తుందని చెబుతూ వయ్యారంగా, వంకరగా, వేదిక మీద నడిచింది.

తన చేతిలో వున్న పన్నెండు కార్డుల్లో ఒకటి తీయమని, గూట్లో వున్న గోరింకని, ముద్దుగా పిలిచి ఆహ్వానించింది. గోరింక రెక్కలు టపటపా కొట్టుకుంటూ... ఒక కార్డు తీసి వెనక్కి వెళ్ళిపోయింది.

' సుహాసినీ, ఫ్రమ్ చిలకలూరిపేట" యాంకరమ్మ పెద్దగా చదివి చప్పట్లు కొట్టింది. సుహాసిని, తన ఇద్దరు పిల్లలతో, భర్త వెంటరాగా వేదిక ఎక్కింది. మిగతా పదకొండు జంటలు చప్పట్లు కొడుతున్నారు. వాళ్ళ ముఖాల్లో ఆశ నిరాశలు ఊగిసలాడుతున్నాయి

వేదికమీద సుహాసిని, మొదటి నిబంధన ప్రకారం.. ' ఓలమ్మో! ఆడెవడొగాని.. కమ్మలెడతనన్నడే.....!' పాట పాడుతూ, తదనుగుణంగా స్టెప్పులు వేస్తోంది.

" ఈ పదకొండుమందిలో, నీ పేరు గోరింక తీస్తుందో... లేదో.. తీయకపోతే వెనక్కి వెళ్ళి పోవడమేగా?" చిదానందం,అలివేలుతో అనుమానం వెలిబుచ్చాడు.

" నోరు మూసుకోండి! అపశకునం మాటలూ మీరూనూ! ఇంతవరకూ వచ్చిన తరువాత... పిలుపు రాకపోతుందా? అదృష్టలక్ష్మి వరించకపోతుందా? " అలివేలు మొగుడ్ని ఛీకొట్టిపడేసింది.

మొదటగా వెళ్ళిన సుహాసిని.... తత్తరపాటుతో రెండో ప్రశ్నకు జవాబు చెప్పలేక కేవలం రెండుగ్రాముల బంగారంతో వెనక్కి తిరిగొచ్చేసింది.

" నేనయితేనా పది ఆటలూ ఆడి వెయ్యి గ్రాములు గెలుచుకోనూ... ?" అంది అలివేలు.

మళ్ళీ చప్పట్లు మధ్య... యాంకరమ్మ చిన్న బ్రేకు తరువాత గోరింకతో మరో కార్డు తీయించింది.

"అలివేలు... ఫ్రమ్ కాకినాడ" యాంకరమ్మ చప్పట్లు కొడుతూ అరిచింది. అలివేలుకు కాళ్ళు నిలబడలేదు. గాలిలో తేలిపోతున్నాయి.... ఎలా లేచిందో, భర్త పిల్లలతో ఎలా వేదికెక్కిందో తెలీదు... చప్పట్లు... హెూరు... ఆనందోద్వేగం, యాంకరమ్మ ఎదురుగా, అలివేలు, చిదానందం, పిల్లలు కుషన్ కుర్చీల్లో కూర్చున్నారు.

యాంకరమ్మ పళ్ళన్నీ బయటపెట్టి.... పిల్లల్ని ముద్దుపెట్టుకుంది. అలివేలును, ఆమె మొగుడ్ని పలకరించి జోకులువేసింది. వృత్తి వివరాలు అడిగింది.

యాంకరమ్మ కోరికమీద, అలివేలు 'మంగళగౌరీ మహేశ్వరీ... మముగన్న తల్లీ పరమేశ్వరీ' పాట పాడింది. పాడినందుకు గాను, రెండు గ్రాముల బంగారం గెలుచుకుంది. అలివేలు ఆ రెండు గ్రాముల బంగారాన్ని కళ్ళకద్దుకుంది. కనకవర్షం మొదలైంది అనుకుంది.

యాంకరమ్మ రెండవ ఆట మొదలెట్టింది..! అలివేలు కొడుక్కి ఒక కార్డు ఇచ్చింది. అందులో ఒక సినిమా పేరుందని చెప్పింది.

" దీన్ని మనసులో నువ్వే చదువుకుని ఆ సినిమా పేరుని... పెదాలు విప్పకుండా సైగలతో, మీ అమ్మా, నాన్నలకు చెప్పాలి. వాళ్ళిద్దరిలో ఎవరు ఏ పేరు చెప్పినా పది గ్రాముల బంగారం వరిస్తుంది. సరేనా?" అంటూ వివరించి చెప్పింది... అలివేలు కొడుకు తల ఊపి కార్డులో పేరు చదువుకున్నాడు. అలివేలుకు, చిదానందంకి ఆసినిమా పేరు సైగలతో చెబుతున్నాడు. పైనుంచి క్రిందకి మెలికతిప్పి చూపుడు వ్రేలుతో చేతిమీద ఏవేవో గుర్తులు, సున్నాలను చుడుతూ... వారికి చూపిస్తున్నాడు.

వాళ్ళకేమీ అర్ధం కావడంలేదు. అంతా అయోమయంగాఉంది... ఆందోళనగా ఉంది. అలివేలు తనకు గుర్తొచ్చిన సిన్మా పేర్లన్నీ చెప్పింది. ప్రేమానందం, రెండు మూడు పేర్లు చెప్పాడు. ఊహూ అవి ఏమీ కార్డులోని పేరుతో సరిపోలేదు.

బజర్ 'బొంయ్ ' మంటూ మోగింది. టైమయిపోయిందంటూ, యాంకరమ్మ 'సారీ' చెప్పేసింది. ఆ సినిమా పేరు 'ప్రేమలేఖ'! అయిపోయింది. ఒక ఆశ ! ఒక అశనిపాతం... ! అంతా గోల్‌మాల్! అలివేలు గుండెల్లో రాయిపడిపోయింది.

అలివేలును, కిందకు వెళ్ళమని ప్రేమగా దువ్వుతూ నెక్స్‌టైమ్ బెటర్‌లక్‌గా యాంకరమ్మ సాగనంపేస్తోంది.

'ఒళ్ళంతా బంగారం'లో "వెయ్యిగ్రాముల బంగారం గెలుద్దామంటే... అరచేతిలో రెండు గ్రాముల బిళ్ల....! ఏమయింది... శ్రీమహాలక్ష్మీ...?" లక్ష్మీదేవిని ప్రశ్నిస్తూ అలివేలు వేదికదిగడంలేదు... వెక్కి, వెక్కి ఏడుస్తోంది... యాంకరమ్మ ఓదార్చినా ఆగడంలేదు.

ఎదురుగా కెమెరాలు, అలివేలు, దు:ఖాన్ని... శోకాన్ని అందంగా షూట్‌చేస్తున్నాయి. " బంగారం కోసం.... విజేతకాని, ఓ ఆంధ్ర ఆడపడుచు విలాపం" అంటూ విరామంగా... ముక్క ముక్కలుగా... తెరలు తెరలుగా 'వైటీవి' ప్రసారం చేస్తోంది. చిదానందం భార్యను పొదివిపట్టుకున్నాడు. అలివేలు భోరుమని ఏడుస్తోంది. తప్ప ఓర్చుకోవడంలేదు. ఎంతటి భంగపాటు.. లాటరీలాంటి ఆటల్లో పిచ్చిగా ఆశలు పెంచుకోవడం... కలలు కనడం.. ఎంత పొరపాటు? ఎంత గ్రహపాటు?

అలివేలు బలవంతంగా, వేదిక దిగుతూంటే... 'వై టీవి' స్టూడియో గిర్రున తిరుగుతున్నట్టు అనిపించి, భర్త చిదానందం చేతుల్లో స్పృహ తప్పిపోయింది.

ఎవరో వచ్చారు.... సాయం చేశారు.... ఎంత ఉపశమనం కలిగించినా, అలివేలు కళ్ళు తెరవనేలేదు.. ఊరుగాని ఊరు పరిచయంలేని మనుషులు... భార్య గురించి, భయం, బాధ... బెంగ... చిదానందానికి ఏమీ పాలుపోలేదు. ఎవరో ఇచ్చిన సలహాతో.. దగ్గరగా వున్న గ్లోబల్ ఆసుపత్రికి అలివేలును మోసుకుపోయాడు.

మర్నాడు మధ్యాహ్నం.. అలివేలు కళ్ళు తెరచింది. తన రెండు చేతులకీ తళతళలాడుతూ వుండాల్సిన నాలుగు బంగారు గాజులు కనపడలేదు... !

"గ్లోబల్ ఆసుపత్రి బిల్లుకు గుండె బేజారెత్తి 'మా ఆవిడ బంగారం' అమ్మక తప్పలేదు.," చిదానందం బేలగా అన్నాడు భార్య అలివేలుతో.

❀ ❀ ❀ ❀ ❀ ❀

(స్వాతి వీక్లీ కామెడీ కథ 7-12-2007)